
సాక్షి పల్నాడు

ఆదివారం । 24 । మార్చి । 2024




కల్యాణ మహోత్సవం

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులో కొలువైన భూ–నీళా సమేత వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి బలిహరణ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
నరసరావుపేట	6.26	4.52
గుంటూరు	6.24	4.54
బాపట్ల	6.24	4.52

న్యూస్‌రీల్

మొసలిని పట్టుకున్న ఫారెస్టు అధికారులు



గురజాల: నగర పంచాయతీలోని లక్ష్మీటాకీసు సెంటర్‌లో గల ఒద్దుల వాగులో కొద్ది రోజుల కిందట మొసలి కలకలం రేపిన సంఘటన పాఠకులకు విదితమే. మొసలి రాత్రి సమయాల్లో బయటకు వస్తున్న విషయాన్ని స్థానికులు గమనించారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మొసలి ఒడ్డుకు రావడాన్ని గమనించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. తెల్లవారుజామున దైద ఫారెస్టు బీట్ ఆఫీసర్ బి నాగేశ్వరరావు తన సిబ్బందితో కలసి వచ్చి మొసలిని అదుపులోకి తీసుకుని పొందుగుల కృష్ణానదిలో వదిలిపెట్టారు. చెరువులో మరొక మొసలి కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

డీఐఓ ఆకస్మిక తనిఖీ



కారెంపూడి: కారెంపూడి ఇందిరానగర్ కాలనీలోని ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీ కాల కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ పి గీతాంజలి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల వివరాలు ఎంసీపీ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. మాతా శిశు సంరక్షణ రిజిస్టర్‌ను పరిశీలించారు. జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు, కారెంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం రమ్య, డాక్టర్ కె లక్ష్మీమౌనిక, సీహెచ్‌ఓ మల్లయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పి పిసమ్మ, బి విమల, బి రాజేశ్వరి, కె రాజేశ్వరి, ఎ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాల (బాలుర)లో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఏపీఆర్‌డీసీ సెట్–2004 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేది కల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్ష 26 జిల్లా కేంద్రాలలో జరుగుతుందన్నారు.

కల్యాణం....కమనీయం

- దేవరంపాడులో వేడుకగా మహోత్సవం
- గోవిందనామస్మరణతో మారుమోగిన ఆలయం



రాజుపాలెం: దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన వేంకటేశ్వరుడి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా రాష్ట్ర మంత్రి అంబటి స్వామివారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను తీసుకురాగా వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రోచ్చారణ, బ్యాండ్ వాయిద్యాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. సమీప ప్రాంతాల నుంచే గాక, సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామి వారిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామస్మరణతో కొండ మారుమ్రోగింది. భక్తులు స్వామివారికి పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశుసంపదను కాపాడాలని స్వామివారికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. కల్యాణం అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. వారి వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, దేవస్థాన కమిటీ చైర్మన్ శాఖమూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత, నాయకులు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఓటరూ..మేలుకో

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఐదేళ్లకోసారి పాలకులను ఎన్నుకునే తరుణం ఆసన్నమైంది. మనం వేసే ప్రతి ఒక్క ఓటు రాజకీయాలను శాసించి గెలుపోటములను నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోవాలి. పేరు లేకుంటే వెంటనే ఓటు నమోదుకు దరఖాస్తు ఫారం –6 చేసుకోవాలి. చివరి సారిగా ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్లకు గడువు ఉండడంతో అర్హులందరూ మేల్కోవాలి. లేకుంటే ఓటేసే పరిస్థితి ఉండదు. ఉత్తమ నాయకులను ఎన్నుకునే అవకాశం కోల్పోతారు.

- జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తుకు అవకాశం
- ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశం ఇచ్చిన ఎన్నికల సంఘం
- యువతకు అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం
- జిల్లాలో 17,20,997 మంది ఓటర్లు



ఓటరు గుర్తింపు కార్డులు

సత్తెనపల్లి: జిల్లాలో ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని యువతీ, యువకులకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఎన్నికల సంఘం వచ్చే నెల 15వ తేదీ వరకు ఓటు హక్కు నమోదుకు వెసులుబాటు కల్పించింది. 2024 ఏప్రిల్ ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లాలో ఓటు హక్కుకు ఇంకా నమోదు చేసుకోని వారికి అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తొలుత సరి చూసుకోవాలి. జాబితాలో పేర్లు లేని వారు తమ సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో బూత్ లెవెల్ అధికారు(బీఎల్ఓ) లను సంప్రదించాలి. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. కొత్తగా ఓటు నమోదుకు ఫారం –6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. బీఎల్ఓలకు ఓటరు దరఖాస్తులు అందజేయవచ్చు. ఆన్‌లైన్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. htpp//:coeandhara.nic.in,htpp//:voterr.eci. gov.i n వెబ్‌సైట్లను సైతం సంప్రదించవచ్చు.

ఆఫ్‌లైన్ ద్వారా...

ఓటు హక్కు నమోదు కోసం ఆఫ్‌లైన్ దరఖాస్తు చేసుకోవడం ద్వారా ఫారం–6ను బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ)లకు ఇవ్వచ్చు. ప్రతి నియోజకవర్గానికి ఈఆర్వోని ఎన్నికల సంఘం నియమించింది. వారి కార్యాలయాల్లోనూ దరఖాస్తులు అందజేయవచ్చు. ప్రతి మండలంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దారులకు ఓటు నమోదు కోసం దరఖాస్తు తీసుకునే అధికారాన్ని ఎన్నికల సంఘం కల్పించింది.

యువత ముందుకు రావాలి



కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. 18 ఏళ్లు నిండిన వారితో పాటు ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారు కూడా నమోదు చేసుకోవచ్చు. ఓటు హక్కు పొందే వారికి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఐదేళ్లపాటు ప్రజలను పాలించే పాలకులను ఎన్నుకోవడంలో ఓటే కీలకం. ఓటు హక్కు నమోదుకు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.

– వి.మురళీకృష్ణ,
రిటర్నింగ్ అధికారి, సత్తెనపల్లి

జిల్లాలో 17,20,997 మంది ఓటర్లు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,926 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈనెల 20వ తేదీ నాటికి 17,20,997 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,50,146 మంది పురుషులు, 8,80,662 మంది మహిళలు, 189 ఇతరులు ఉన్నారు. ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. గురజాల నియోజకవర్గంలో అత్యధికంగా 2,71,989 మంది ఓటర్లు ఉండగా అతి తక్కువగా చిలకలూరిపేట నియోజకవర్గంలో 2,25,295 మంది ఓటర్లు ఉన్నారు.

త'స్మార్ట్'.. శృతిమించొద్దు!

- సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారంపై ఆంక్షలు
- మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి
- శృతిమించిన, అసత్య ప్రచారాలపై కేసులు నమోదు
- నేరం రుజువైతే పదేళ్ల జైలు, రూ.2లక్షల జరిమానా
- వివాదాస్పద పోస్టులు చేసినా, పార్వర్డ్ చేసినా బాధ్యులే
- మార్గదర్శకాలు నిర్దేశించిన కేంద్ర ఎన్నికల సంఘం



కొరిటెపాడు(గుంటూరు): సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. ఆయా పార్టీల నేతలు ప్రత్యక్షంగా ఓటర్లను కలవడంతో పాటు సామాజిక మాధ్యమాల(వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్, ఇన్‌స్టాగాం) ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో శృతిమించిన, అసత్య ప్రచారం చేపడితే పోలీసు కేసులు నమోదు చేయడంతో పాటు.. జైలు శిక్షలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సోషల్ మీడియాకు కూడా ఎలక్ట్రానిక్ మీడియాకు మాదిరిగానే ఎన్నికల నిబంధనలు వర్తింపజేస్తోంది.

'సోషల్' ప్రచారం..పెయిడ్ న్యూస్ కిందకే..

సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే.. ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.

ఫార్వర్డ్ చేసినా నేరమే..

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తమ వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికల్లో పోస్టింగ్ చేసినా, సందేశాలను ఫార్వర్డ్ చేసిన వారిపై కూడా చర్యలు ఉంటాయి.

గ్రూప్ అడ్మిన్ బాధ్యతలివే..

సోషల్ మీడియాలో గ్రూప్ సభ్యులు అభ్యంతరకరమైనా.. వివాదాస్పద పోస్టులు, కామెంట్స్ పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రస్తుత ఎన్నికల నిబంధనల మేరకు.. పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి.

అధికారుల నిరంతర నిఘా

సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారులు నిఘా ఉంచుతారు. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఫొటోలు, సందేశాలు ఉంటే వాటిని ఐటీ యాక్ట్–2000 కిందకు తీసుకొచ్చి.. సెక్షన్–67 కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు.

సోషల్ మీడియా.. మార్గదర్శకాలు ఇవే

- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా, పార్టీలపై, సంస్థలు, అధికార యంత్రాంగంపై అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే.. వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.
- చట్ట విరుద్ధమైన ప్రకటనలతో, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయొద్దు.
- అసత్య ప్రచారం చేస్తే ఐపీసీ–504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.
- సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు.. జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి పొందాల్సి ఉంటుంది.

ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సంసిద్ధం

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- ప్రశాంత ఎన్నికల కోసం పటిష్ట ఏర్పాట్లు
- జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ నుంచి పర్యవేక్షణ
- కోడ్ ఉల్లంఘన అంశాలపై చర్యలు
- రూ.17.94 లక్షలు నగదు సీజ్
- రూ.23.31లక్షలు విలువైన లిక్కర్ స్వాధీనం



కలెక్టరేట్ నుంచి ఎన్నికల అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపాల పర్యవేక్షణ (మానిటరింగ్) పకడ్బందీగా జరుగుతోందని వెల్లడించారు. శనివారం సాయంత్రం ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. ఈ నెల 16వ తేదీన భారత ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూలు ప్రకటించిన వెంటనే జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ కార్యకలాపాలు నిర్వహణలోకి తీసుకొచ్చామన్నారు. జిల్లా ఎలెక్షన్ కంట్రోల్ రూమ్, ఎంసీఎంసీ (ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా, సోషల్ మీడియా సెల్) 24/7 కాల్‌సెంటర్, కంప్లైంటింగ్ మానిటరింగ్ సెల్, రిపోర్ట్ మేనేజ్‌మెంట్, డిస్ట్రిక్ట్ గ్రీవిన్స్–కంప్లయింట్స్–రిఅడ్రెసల్ సెల్' విభాగం ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, ఫీల్డ్ మానిటరింగ్ యూనిట్–ఎంసీసీ, ఖర్చుల మానిటరింగ్, పర్మిషన్–ఎన్‌ఫోర్స్‌మెంట్ అంశాలకు సంబంధించిన డెస్కులను ఏర్పాటు చేశామన్నారు.

కంట్రోల్ రూమ్‌లో ల్యాండ్ లైన్ ఏర్పాటు

ఎప్పటికప్పుడు సమాచారం, సేవల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు 08647–252999 నంబర్లకు ఫోన్‌చేసి మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు స్వీకరించటంతో పాటు ఎన్నికల సమాచారాన్ని అందజేస్తున్నామన్నారు.

కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వారిపై తక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి 23వ తేదీ వరకు కోడ్ ఉల్లంఘన సహితమైన పబ్లిక్, ప్రయివేటు వ్యక్తులకు సంబంధించి పోస్టర్లు, గోడలపై రాతలు, పార్టీ జెండాలు తొలగించడంతోపాటు విగ్రహాలకు ముసుగులు వేయించామని చెప్పారు. పబ్లిక్ ప్రాపర్టీకి సంబంధించి 1257 వాల్ రైటింగ్స్, 3666 పోస్టర్లు, 3263 బ్యానర్లు, 3039 ఇతరత్ర వాటితో కలిపి మొత్తం 11225 వాటిని ఫిర్యాదు అందిన గంటల వ్యవధిలోనే తొలగించడం జరిగిందన్నారు. ప్రైవేటు ప్రాపర్టీకి సంబంధించి 498 వాల్ రైటింగ్స్, 1057పోస్టర్లు, 947 బ్యానర్లు, 1336 ఇతరత్ర వాటితో కలిపి మొత్తం 3838 తొలగించామని తెలిపారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీముల ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ.17.9లక్షలు మేర నగదు, రూ.23.31లక్షలు విలువైన లిక్కర్, రూ.52.65లక్షలు విలువైన ఇతర వస్తువులు సీజ్ చేశామని తెలిపారు. ఎంసీసీ ఉల్లఘించిన పలువురిపై కేసులు, షోకాజ్ నోటీసులు, అధికారుల సస్పెన్షన్ కూడా జరిగిందని వెల్లడించారు. సమావేశంలో డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేటఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని 14 మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలలు)లో 2024–25 విద్యా సంవత్సరానికిగాను మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అర్హత గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో చేరగోరే విద్యార్థుల అర్హతలు, దరఖాస్తు చేసుకునేందుకు httpr://apmr.apcfrr.in/,httpr://cre.ap.gov.in/వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అర్హతలను పరిశీలించుకొని సంతృప్తి చెందిన విద్యార్థులు ఈనెల 28 నుంచి మే నెల 22వ తేదీ వరకు గేట్‌వే ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించి, వారికి కేటాయించిన జనరల్ నెంబర్ ద్వారా సదరు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు రుసుం ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సీట్లు కేటాయింపు విద్యార్థికి 10వ తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ఉంటుందని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు తమకు దగ్గరలోని మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్‌ను, మండల, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రారండోయ్..శింగరకొండ తిరునాళ్లకు

- ధ్వజారోహణంతో శింగరకొండ ఉత్సవాలు ప్రారంభం
- 25న ప్రధాన తిరునాళ్ల
- రెండు లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా
- ఆకట్టుకోనున్న విద్యుత్ ప్రభలు



శింగరకొండ క్షేత్రం

అద్దంకి: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శింగరకొండ తిరనాళ్లు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారికి ఆనుకుని శింగరకొండపాలెం గ్రామ సమీపంలోని భవనాశి చెరువు పక్కనే స్వయంభువుగా వెలసిన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రం 69వ వార్షిక తిరుణాళ్లకు ముస్తాబైంది. శనివారం ధ్వజారోహణతో శింగరకొండ తిరునాళ్లకు అంకురార్పణ జరిగింది. ఈ తిరునాళ్లకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి సుమారు రెండు లక్షల మందికిపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకోనునున్నాయి. ఆలయ రాజగోపురాలు, క్షేత్ర పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. సుమారు 800 మంది పోలీసులు ఉత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం..

క్షేత్రంలో పూర్వం కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు జరుగుతుండగా.. కొండకు దిగువ భాగంలో చిల్లచెట్ల మధ్య ఒక దివ్యమైన వెలుగు భక్తులకు కనిపించింది. కొందరు ఆదే సమయంలో కిందకు వచ్చి చూడగా అక్కడ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం దర్శనమిచ్చింది. స్వామికి మొదట్లో పశువుల కాపరులు తమ గొర్రెలు, పశువులు చల్లగా ఉండాలని మొక్కుకునేవారు. వారి కోర్కెలు స్వామి తీర్చేవారు. తమ కోరిక తీరగానే పశువులను, గొర్రెలను స్వామి విగ్రహం చుట్టూ తిప్పి, పొంగలి పెట్టుకుని మొక్కులు తీర్చుకునే వారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఆ నోట, ఈ నోట విన్న పరిసర గ్రామాల భక్తులు ఇక్కడకు రావడం మొదలు పెట్టారు. వారి కోర్కెలు కూడా నెరవేరడంతో తొలుత పశువుల కాపరులు వేసిన పందిరి చిన్న గుడిగా నిర్మితమైంది. అనంతరం శాశ్వత దేవస్థానం ఏర్పడి.. ఆదాయం బాగా వస్తుండటంతో దేవదాయశాఖ పరిధిలోకి చేరింది.

ముస్తాబైన సపరివార దేవతల దేవాలయాలు

తిరునాళ్లలో భాగంగా క్షేత్ర పరిసరాల్లో ఉన్న శ్రీరామనామ సంకీర్తన మందిరం, విద్యుల్లత షిర్డిసాయి ఆలయం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, బ్రహ్మంగారి, గాయత్రి మాత, పోలేరమ్మ దేవస్థానాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

లడ్డూ, పులిహోర ప్రసాదాలు రెడీ

దేవస్థాన ఆధ్వర్యంలో తిరునాళ్లకు వచ్చే అత్యధిక భక్తులకు అందించేందుకు లడ్డూ, పులిహోర ప్రసాదానాలు సిద్ధం చేసినట్లు ఆలయ ఏసీ రఘునాథరెడ్డి తెలిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత ప్రసాదం అందించనున్నారు. క్షేత్రంలో అన్ని సామాజిక వర్గాల వారికి సంబంధించిన సత్రాలు ఉన్నాయి. ఆయా సత్రాల్లో ప్రధాన తిరునాళ్ల రోజు ఉదయం నుంచి తెల్లవారే వరకు అన్నదానం చేస్తూనే ఉంటారు.

ప్రత్యేక దర్శనం..

దేవస్థానంలో ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. క్షేత్రాధిపతి నరసింహస్వామి దేవస్థానానికి వెళ్లడానికి రెండు ఉచిత బస్సులు దాతల సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. పరిసరాల్లో జెయింట్ వీల్స్, వివిధ రకాలైన ఆట బొమ్మల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.



తిరునాళ్లకు ఏర్పాటు చేసిన జెయింట్ వీల్స్

99 అడుగుల అభయాంజనేయస్వామి..

శింగరకొండకు మధ్య ఉన్న ట్రయాంగిల్ స్థలంలో 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం ఉంది. ఈ విగ్రహం రాష్ట్రంలోని ఎత్తైన ఆంజనేయ స్వామి విగ్రహాల్లో రెండోది.



బిడ్డకు జన్మనిచ్చి.. తిరిగిరాని లోకాలకు

పెదకాకాని: పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి మృత్యువుతో పోరాడి ఓడిన సంఘటన ఉప్పలపాడులో చోటు చేసుకుంది. వెంటిలేటర్‌పై మేరి(24) తుది శ్వాస విడవడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. బంధువులు, వైద్య సిబ్బంది, స్థానిక పెద్దల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. మేరికి తల్లిదండ్రులు లేకపోవడంతో పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న మేనమామ వద్ద పెరిగింది. అదే ప్రాంతానికి చెందిన నాగండ్ల కార్తీక్ అలియాస్ ఏసుబాబుతో మేరికి మూడేళ్ల క్రితం వివాహమైంది. వారి దాంపత్య జీవితంలో ఏడాదిన్నర పాప మానస. రెండో కాన్పుకు ఈనెల 13వ తేదీన గుంటూరులోని శ్రీనివాస నర్సింగ్‌లో చేర్చారు. డాక్టర్లు ఆపరేషన్ చేయడంతో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం జరిగిన గంటన్నర వ్యవధిలోనే తల్లి అపస్మారకస్థితిలోకి చేరడంతో అందుకు సంబంధించిన చికిత్స చేసే మిషనరీ(ఎక్విప్‌మెంట్) మా వద్ద లేదు మరొక ఆసుపత్రికి వెళ్లాల్సిందిగా సూచించారు. ఎలాగైనా ప్రాణాలు కాపాడుకోవాలని ఆమెను సమీపంలో ఉన్న అమృత ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ప్రారంభించిన గంటలోపే రూ.30 వేలు బిల్లు వసూలు చేయడంతో పాటు మా ఆసుపత్రిలో గంటకు రూ.20 వేల వరకూ ఖర్చు అవుతుందని అందుకు ఇష్టమైతే ఉండండి లేదంటే ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని సూచించారు. అంత పెద్ద మొత్తంలో వైద్య ఖర్చులు భరించలేక మేరిని అదేరోజు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పదిరోజుల పాటు ఆమెకు వెంటిలేటర్‌పైనే వైద్యం అందించారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో రెండు రోజులు ముందే ఇంటికి పంపించారు. పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి ఆమె మృతిచెందింది. విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అక్కడికి చేరుకున్నారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవమైన వారికి 'ఆసరా'

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవమైన ప్రతి మహిళకూ ఆసరా కింద రూ. 5000 పారితోషికం అందజేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆసరా అమలుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవం అయిన వారి డాక్యుమెంట్లతో పాటు ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జి.చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ సీతారామిరెడ్డి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన కానిస్టేబుల్ అరెస్ట్

క్రోసూరు: క్రోసూరు గ్రామానికి చెందిన యువతిపై శుక్రవారం లైగింక దాడికి పాల్పడిన సంఘటనలో నిందితుడైన పోలీసు కానిస్టేబుల్ ఎం.రవిబాబును శనివారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. కిడ్నాప్, రేప్ సెక్షన్ల కింద అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారం మాయం

కారంపూడి నుంచి నరసరావుపేట వస్తున్న బస్సులో సంఘటన

నరసరావుపేట టౌన్: ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారంపూడికి చెందిన బొల్లినేని వెంకటరమణ నరసరావుపేటకు వచ్చేందుకు కారంపూడిలో ఆర్టీసీ బస్సు ఎక్కారు. నరసరావుపేట పల్నాడు బస్టాండ్‌లో బస్సు దిగుతున్న సమయంలో బ్యాగ్ చూసుకోగా అందులోని బంగారు నగల సంచి కనిపించలేదు. దీంతో విషయాన్ని ఆమె బస్సు డ్రైవర్, కండెక్టర్‌కు తెలియజేసింది. ప్రయాణికులు బస్సు దిగకుండా జాగ్రత్త పడి విషయాన్ని కండక్టర్ పోలీసులకు సమాచారాన్నిచ్చారు. ఎస్ఐ అశోక్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ప్రయాణికుల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అయినా ఎటువంటి ఫలితం లేకపోవటంతో బాధితురాలిని విచారించారు. హారం, నక్లెస్ కలిపి సుమారు 13 సవర్ల విలువైన రెండు వస్తువులు చోరీ జరిగినట్లు ఆమె తెలిపింది. దీంతో బస్సులో అనుమానాస్పదంగా ఉన్న వారి గురించి ఆరా తీశారు. ముగ్గురు మహిళలు దుర్గిలో బస్సు ఎక్కి కారంపూడిలో దిగాల్సి ఉండగా వారు పేటసన్నిగండ్లలో దిగినట్లు కండక్టర్ ఎస్ఐకు వివరించారు. దీంతో వారు ముగ్గురు దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావడం ఖాయం

- ప్రజల ఆదరణే ఇందుకు సాక్ష్యం
- సంక్షేమ పథకాలే గెలుపు అస్త్రాలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పార్టీలో చేరిన వారితో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రవ్యాప్తంగా మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదేనని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మళ్లీ ముఖ్య మంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడం ఖాయమని, ప్రజల నుంచి వస్తున్న ఆదరణే ఇందుకు సాక్ష్యమని తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 2,3 వార్డులో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే వెనుకబడిన తరగతుల వారికి సరైన న్యాయం జరిగిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయాస్త్రాలని పేర్కొన్నారు.

టీడీపీ, బీఎస్పీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 30 కుటుంబాలు

పట్టణంలోని 3వ వార్డులోని జాషువా నగర్ కాలనీలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో బీఎస్పీ నేత వర్ల వెంకటేశ్వర్లు నాయకత్వంలో 15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. 2వ వార్డులో కౌన్సిలర్ మాదిగొండ చంటీశ్వరి నారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికీ మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, పక్కాల సురిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ మక్కెన అచ్చయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పార్టీ నాయకులు వరికల్లు కోటేశ్వరరావు, కోటిలింగం, కాటుమాల డేవిడ్, జె.ప్రసాద్, షేక్ హనీఫ్, షేక్ నాగుల్ బాషా, దాసరి తిరుపతిరావు, ప్రజా ప్రతినిధులు, పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ప్రభుత్వ ఉపాధ్యాయిని అభినందనలు



అరవిందబాబును కలిసి అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయిని బాలప్రకాశరాణి, భర్త ఫ్రాన్సిస్

ముప్పాళ్ల : మండలంలోని గోళ్లపాడు ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కె.బాలప్రకాశరాణి నరసరావుపేట టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబును కలిసి అభినందించారు. ఆ పార్టీ అధ్యక్షుడు గురువారం విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో అరవిందబాబు పేరు ఖరారు చేశారు. దీంతో ఉపాధ్యాయిని బాలప్రకాశరాణి భర్త బెల్లంకొండ ఫ్రాన్సిస్‌తో కలిసి నరసరావుపేటలోని అరవిందబాబును కలిసి పూల బోకేతో అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ ఫోటో వైరల్ గా మారింది. బాలప్రకాశరాణి 1998 డీఎస్సీ అభ్యర్థిని. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం పోస్టింగ్‌లు ఇవ్వడంతో బాలప్రకాశరాణి ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఎంపికైంది. ఆరు నెలల కిందట ముప్పాళ్ల మండలంలోని గోళ్లపాడు ఎంపీయూపీ పాఠశాలలో విధుల్లో చేరారు. అరవిందబాబుకు టీడీపీ అభ్యర్థిగా ఎంపిక కావడంతో కుటుంబసభ్యులతో కలిసి అభినందనలు తెలిపారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయిని స్వస్థలం ముప్పాళ్ల మండలంలోని తురకపాలెం గ్రామం.

యువతకు స్వయం ఉపాధి శిక్షణ

అమరావతి: యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15నుంచి సెల్‌ఫోన్ రిపేర్ , సర్వీసు, 22నుంచి డీటీపీలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 19నుంచి 45 ఏళ్లలోపు యువతీ, యువకులు, మహిళలు అర్హులని వెల్లడించారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు తెల్ల రేషన్, ఆధార్ కార్డు ఫొటోస్టాట్ , నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, 10వ తరగతి పాస్/ ఫెయిల్ సర్టిఫికేట్ ఫొటోస్టాట్ యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, డోర్ నం. 14-1-14, ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్, కొత్తపేట, గుంటూరులో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0863-2336912, 9700687696, 8125 397953, 9949930155 నంబర్లలో సంప్రదించాలని కోరారు

ఇద్దరు చైన్ స్నాచర్స్ అరెస్ట్

- ఒంటరి మహిళలే టార్గెట్
- రూ.8 లక్షల విలువైన బంగారం స్వాధీనం



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి, పక్కన సీఐ భాస్కర్, ఎస్ఐ అశోక్

నరసరావుపేట టౌన్: ఒంటరి మహిళల్ని టార్గెట్‌గా చేసుకొని చైన్స్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8 లక్షల విలువైన 16 సవర్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. రామిరెడ్డిపేటకు చెందిన షేక్ నాగూర్ బాబు, ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన ఆరే మురళీమోహన్‌రెడ్డి గతంలో చోరీ కేసుల్లో అరెస్ట్ అయి గుంటూరు సబ్ జైల్‌లో ఉన్నారు. బయటకు వచ్చిన తర్వాత ఇద్దరు ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలో బంగారు నగలు దోచుకెళ్తుంటారు. గత నెలలో గంట లలితాదేవి కాలనీకి చెందిన సరోజిని మార్కెట్ సెంటర్‌కు వచ్చి వెళ్తుండగా, ఆమె మెడలో బంగారపు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు వెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నాగూర్ బాబు, మోహన్‌రెడ్డి శనివారం పల్నాడు రోడ్డు చెక్ పోస్టు వద్ద పోలీసులకు తారసపడి పరారీ అవుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పై నేరంతో పాటు నాదెండ్ల, నకరికల్లు, టూటౌన్ పరిధిలోని పలుచోట్ల మొత్తం ఆరు ప్రాంతాల్లో చైన్స్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి 16 సవర్ల ఆరు బంగారు ఆభరణాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుల్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. నిందితులపై గతంలో నాలుగు చోరీ కేసులు ఉండగా, తాజాగా ఆరు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారన్నారు. సమావేశంలో టూటౌన్ సీఐ భాస్కర్, ఎస్ఐ అశోక్, ఏఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్రశాలలో వైభవంగా వసంతోత్సవం



ప్రత్యేక అలంకారంలో స్పటిక శివలింగం

సత్రశాల(రెంటచింతల): మండలంలోని ప్రసిద్ధ శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శనివారం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు చిట్యాల శివశర్మ, మల్లికార్జునశర్మ నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు, వివిధ అభిషేకాలు జరిపారు. మహాశివరాత్రి వెళ్లిన 16 రోజుల తరువాత వసంతోత్సవాన్ని దేవస్థానంలో నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి దీవెనలను పొందారు. ఉత్సవమూర్తులు భ్రమరాంబికాదేవి, మల్లికార్జునస్వామి, స్వర్ణ స్పటిక శివలింగంతో పాటు దేవస్థానంలో ప్రతిష్ఠించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి, గంగా పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి, సువర్చల సమేత శ్రీ ఆంజనేయస్వామి తదితర పంచలోహ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. దేవతామూర్తులకు దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి దంపతులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో బుర్రి నెమిలిరెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎ. నర్శింహారెడ్డి, జి. పేరమ్మ, ఎం. కొండా నాయక్, జి. పెద్ద సైదులు, యు. పద్మావతి, డి. కమలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ అభ్యర్థి అనిల్ జన్మదిన వేడుకలు



ప్రకాష్‌నగర్ పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి



పట్టణంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు



క్రోసూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ నాయకులు

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్ అరవై అడుగుల రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల మధ్య శాసన సభ్యులు, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కేకు కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొరబోయిన శ్రీనివాసరావుయాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వాసపాత్రుడు అనిల్

సత్తెనపల్లి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విధేయుడు, విశ్వాసపాత్రుడు నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి, మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని మంత్రి అంబటి రాంబాబు నివాసం వద్ద శనివారం అనిల్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ అనిల్ కుమార్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవాలని, ప్రజల ఆశీస్సులు అనిల్ కుమార్ యాదవ్‌కు అందాలని ఆయన ఆకాంక్షించారు. గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, గంటా ఏసుబాబు, లోకా మాధవ, ముదినేడి సుబ్బయ్య, తుమ్మల వెంకటేశ్వరరావు, యాంపాటి కోటిరెడ్డి, చెంచిరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

క్రోసూరులో ఘనంగా వేడుకలు

క్రోసూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల నడుమ ఆయన భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి అనిల్ యాదవ్‌ను, శాసనసభకు తనను అత్యంత భారీ మెజార్టీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా అందించటం మన ముందున్న కర్తవ్యమని తెలిపారు. కార్యక్రమలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, ఎంపీపీ కోటయ్య, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తెల్లమేకల అంజి, నాయకులు పాల్గొన్నారు.